సాక్షి
తిరుపతి
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



ఇచ్చింది తీసుకో.. పెట్టిందే తిను!
పరిశ్రమల్లో పనిచేస్తున్న వేల మంది కార్మికులు యాజమాన్యాలు పెట్టే నిబంధనలకు ఒప్పుకోని విలవిల్లాడుతున్నారు. - 8లో



పోరాటయోధుడు గౌతు లచ్చన్న
ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పనిచేసిన గౌతు లచ్చన్న సేవలు మరువలేమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. - 8లో



నాల్గోసారీ!
జడ్పీ నాలుగో సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. - 8లో

న్యూస్‌రీల్

డిగ్రీ,పీజీ ప్రవేశాలకు ఎదురుచూపులు

తిరుపతి సిటీ : జిల్లాలో డిగ్రీ, పీజీ అడ్మిషన్లపై ఇప్పటి వరకు ఉన్నత విద్యా మండలి నుంచి అనుమతి రాకపోవడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెమిస్టర్ విధానంలో కొనసాగుతున్న పీజీ, డిగ్రీ కోర్సులకు తొలి సెమిస్టర్ పరీక్షలు అక్టోబర్ నెలలో జరగాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రవేశాలు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు అయోమయంలో పడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా పీజీసెట్–25 ప్రవేశాల ప్రక్రియపై ఉన్నత విద్యామండలి ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్ కోర్సులపై ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 22వ తేదీ (శుక్రవారం) నుంచి 35 రోజుల పాటు మహిళలకు జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్ కోర్సులపై ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి చతురాగమ సదస్సు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ ఆగమ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు చతురాగమ జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆగమ విభాగాధ్యక్షుడు ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో నాలుగు ప్రధాన ఆగమాల గ్రంథాల విశిష్టత, గ్రంథ ముద్రణ, ఆగమాలతత్వ విచారణ, పరిశోధనాంశాలపై పలువురు విద్యాంసులు హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. పలు రాష్ట్రాల నుంచి ఆగమ పండితులు, పరిశోధకులు సుమారు 40 మందికి పైగా జాతీయ సదస్సుకు హాజరు కానున్నట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం ఆక్టోపస్ బిల్డింగ్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 77,043 మంది స్వామి వారిని దర్శించుకోగా 41,859 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.53 కోట్లు సమరి్పంచారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

20తో ముగియనున్న తుది విడత అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఏపీఈఏఎమ్‌సెట్–25 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి తుది విడతలో సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు ఆయా కళాశాలలో ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే సీట్లు పొందిన అభ్యర్థులకు సాంకేతిక విద్యామండలి సమాచారం అందించింది. దీంతో ఇంజినీరింగ్ ప్రవేశాలు దాదాపు ముగిసినట్టే. కానీ జిల్లాలో సుమారు 9 ప్రైవేటు కళాశాలల్లో సీఎస్ఈ, ఈసీఈ తప్ప మిగిలిన బ్రాంచ్‌లలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 2 ప్రభుత్వ, 2 డీమ్డ్ వర్సిటీలు, 5 అటానమస్, 11 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 23,080 సీట్లు ఉండగా, ఇప్పటి వరకు 17,759 సీట్లు మాత్రమే భర్తీ అయినట్లు సమాచారం. మరో 5 వేల సీట్లకు పైగా ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది.


బస్సుల కొరతతో తిరుపతి బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

పడిగాపుల ఫ్రీ జర్నీ

బస్టాండ్లలో ప్రయాణికుల నిరీక్షణ

- 70 శాతం సీట్లు మహిళలకే అంటున్న అధికారులు
- ఆ లెక్క బాగోలేదంటున్న పురుషులు
- అధికారుల్లోనూ స్పష్టత లేని 'స్త్రీశక్తి' ఉచిత పథకం

అమ్మా.. ఆగండి పసుపు రంగు ఉండే బస్సులనే చూసి ఎక్కండి.. అంటూ ఆర్టీసీ అధికారులు మహిళలకు సూచిస్తున్నారు. అదేంది..ఎన్నికల్లో ఏ బస్సు అయినా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితం అని చెప్పారు.. మరి ఈ కండీషన్లు ఏంటని మహిళలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కొన్ని రూట్‌లలో బస్సులు లేకపోవడంతో తిరుపతి బస్టాండ్‌తో పాటు అన్ని మార్గాల్లోనూ ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గంటల కొద్దీ బస్టాండ్లలో నిరీక్షించారు. జిరాక్స్ కాపీలు బస్సుల్లో అనుమతించకపోవడంతో మహిళలు పలుచోట్ల కండక్టర్లతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఉచిత ప్రయాణంపై అధికారులకే స్పష్టత లేకపోవడంపై కొంత సందిగ్ధం నెలకొంది.


మహిళా రిజర్వు సీట్లకు వేసిన పసుపు రంగు

తిరుపతి అర్బన్: పసుపు రంగు ఉండే సర్వీసుల్లోనే మహిళలకు ఉచితమంటున్నారు ఆర్టీసీ పెద్దలు. కాస్త చూసి ఎక్కండి అంటూ సలహాలు ఇచ్చేస్తున్నారు. కూటమి సర్కారు ప్రకటించిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లకు పసుపు రంగులు వేయించారు. మరోవైపు అనుమతి లేని సర్వీసులకు బస్సుపైన స్త్రీశక్తి పథకం వర్తించదు అంటూ స్టిక్కర్లు వేయిస్తున్నారు. ఆ మేరకు స్టిక్కర్లు రెండు రోజుల్లో...ఉచిత బస్సుకు అనుమతులు లేని అన్నీ సర్వీసుల్లోపైన ఉండాలంటూ జిల్లా ఆర్టీసీ అధికారులు 11 డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చేశారు. ఇంకోవైపు ఉచితం కోసం కేటాయించిన బస్సుల్లో 70 శాతం మహిళలకే అవకాశం ఇస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో పురుషులు మండిపడుతున్నారు.


ఉచిత బస్సు స్కీమ్ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాత్రి 12 గంటల వరకు 2,826 మంది ఉచిత బస్సు పథకాన్ని మహిళలు వినియోగించుకున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు 1,70,894 మంది ప్రయాణికులు ఆర్టీసీలో జర్నీ చేసినట్లు ప్రకటించారు. మొత్తంగా చూస్తే ఒక్కో రోజు ఒక్కో రూల్స్ పెడుతున్నారు. జిల్లా స్థాయిలోని ఆర్టీసీ అధికారులకు స్త్రీశక్తి స్కీమ్‌పై స్పష్టత రావడం లేదు.

ఒరిజనల్ గుర్తింపు కార్డులు చూపాలి..
ఆధార్, రేషన్, ఓటరు కార్డు ఇలా ఏదైనా ఒరిజనల్ కార్డును మహిళలు చూపిస్తేనే ఉచితంగా ప్రయాణం చేయడానికి అనుమతి ఇస్తామని కండక్టర్లు చెబుతున్నారు. దీంతో శనివారం పలు మార్గాల్లో వివాదాలు చోటు చేసుకున్నాయి.


బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

అధికారుల లెక్కలు ఇలా..

ఆర్టీసీ బస్సులు జిల్లా వ్యాప్తంగా నడుపుతున్న రూట్ల అంశంలో అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 11 డిపోల పరిధిలో 855 బస్సులు 177 రూట్లలో(మార్గాల్లో) నడుస్తున్నాయి. రోజుకు సుమారుగా 3.39 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. దీంతో రోజు వారీగా 2.70 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేయడంతో రూ.1.70 కోట్ల రాబడి వస్తుంది. అయితే 177 రూట్లలో 136 మార్గాల్లో ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. దీంతో ఇతర మార్గాల్లో బస్సులు లేకపోవడంతో తిరుపతి బస్టాండ్‌తో పాటు అన్ని మార్గాల్లోనూ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. గంటల కొద్దీ బస్టాండ్లలో వేచి ఉంటున్నారు.


పసుపు రంగుతో ఆర్టీసీ బస్సుల సీట్లు

స్త్రీశక్తికి అనుమతి ఉండే సర్వీసులు 356

పల్లెవెలుగు (సొంత బస్సులు 230, అద్దె బస్సులు 44 మొత్తం–274), అల్ట్రా పల్లె వెలుగు (05 బస్సులు అన్నీ అద్దె బస్సులే), సాధారణ ఎక్స్‌ప్రెస్‌లు 41 సొంత బస్సులు, 36 అద్దె బస్సులు మొత్తం 77 బస్సులు

అనుమతి లేని సర్వీసులు 499

స్త్రీశక్తి స్కీమ్‌కు జిల్లాలో 499 బస్సులకు అనుమతి లేదు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాల్సి ఉంది. సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు, అల్ట్రా డీలక్స్‌లు, సూపర్ లగ్జరీ సర్వీసులు, స్టార్ లైనర్, అన్నీ ఏసీ బస్సులు, కాంట్రాక్టు క్యారేజ్ సర్వీసులు, స్పెషల్ బస్సులు, ప్యాకేజ్ బస్సుల్లో అనుమతి లేదు.

70 శాతం సీట్లు మహిళలకే చెప్పడం సరికాదు



పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌ల్లో 70 శాతం సీట్లు మహిళలకు వదిలిపెట్టాలని చెప్పడం సరికాదు. మహిళలకు అయితే ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పురుషులు అయితే టిక్కెట్ తీసుకుంటారు. అక్కడి వరకు ఓకే. అంతేతప్ప 70 శాతం సీట్లు వదిలిపెట్టాలని చెప్పడం మంచి పద్ధతి కాదని భావిస్తున్నాం. – అత్తిరాల సురేష్, వరదయ్యపాళెం

అన్ని బస్సుల్లో అవకాశం ఇవ్వాలి



ఆర్టీసీకి చెందిన అన్నీ బస్సుల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. ఎన్నికల సమయంలో ఇలా మూడు బస్సుల్లోనే ఉంటుందని చెప్పలేదు. అలాగే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అవకాశం కల్పించాలి. విజయవాడకు తిరుపతి మహిళలు వెళ్లాలంటే పల్లె వెలుగులో 10 బస్సులు మారాల్సి ఉంటుంది. నాలుగు రోజులు సమయం పడుతుంది. – యశోధ, తిరుపతి కొర్లగుంట

ఒరిజనల్ కార్డులు చూపించాలి



గుర్తింపు కార్డు విషయంలో ఒరిజనలకార్డులను కండక్టర్లకు చూపాల్సి ఉంది. శనివారం శ్రీకాళహస్తి, కాణిపాకం, రాయచోటి తదితర కొన్ని మార్గాల్లోనే ప్రయాణికులు బస్సుల కోసం కొంత సమయం వేచి ఉన్నారు. బస్సుల కొరత లేకుండా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. 33 శాతం సీట్లు మాత్రం పురుషులు కూర్చోడానికి వీలులేదు. కూర్చున్నా మహిళలు వస్తే లేయాల్సిందే. వాటికి మాత్రమే పసుపు రంగు వేశాం. – జగదీష్, జిల్లా ప్రజా రవాణా అధికారి

జిరాక్స్ పత్రాలకు అనుమతి ఇవ్వాలి



ఆర్టీసీ అధికారులు పసుపు రంగు చూసి..బస్సు ఎక్కమని చెబుతున్నారు. గుర్తింపు కార్డులు ఒరిజనల్ కార్డులు ఇవ్వాలని అడుగుతున్నారు. మొబైల్స్ చూపినా, జిరాక్స్ ఇచ్చినా చెల్లవని చెప్పడంసరికాదు. ఒకసారి ప్రయాణానికే ఆధార్ కార్డును పోగొట్టుకుంటున్నారు. తర్వాత మళ్లీ ఆధార్‌కార్డు కోసం రూ.100 చెల్లించి తీసుకుంటున్నాం. ఫోన్‌లో చూపించినా, జిరాక్స్‌లు చూపించినా అవకాశం కల్పించాలని కోరుతున్నాం. – చెంగయ్య, వాకాడు

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయండి



ఏళ్ల తరబడి తిరుమలలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నాం. మాకు వచ్చే జీతాల్లో 50 శాతం బస్సు చార్జీలకే సరిపోతుంది. అయితే ఎన్నికల సమయంలో మహిళలకు ఉచితం అంటూ హామీ ఇచ్చారు. ఇప్పుడు తిరుమలకు లేదంటే...మేము చార్జీలు చెల్లించి తిరుమలకు వెళుతున్నాం. ఇది ఎక్కడ న్యాయమో చెప్పాలి. – సులోచన, పారిశుద్ధ్య కార్మికురాలు, ప్రయాణికురాలు

టెండర్‌లో బెదిరింపులు

తిరుపతిలోని హథీరాంజీ మఠం అధికారికి టీడీపీకి చెందిన పెద్దబ్బగా పిలుచుకునే నాయకుడు వార్నింగ్ ఇచ్చాడు. తమ అనుమతి లేకుండా గుత్తేదారులు భవనం కూల్చడానికి వీల్లేదంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించినట్లు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- మఠం అధికారికి టీడీపీ నేత వార్నింగ్
- హథీరాంజీ మఠం భవనం కూల్చివేతకు ముగిసిన టెండర్ ప్రక్రియ
- టెండర్ దక్కించుకున్న పుత్తూరు పయనీర్ స్టీల్స్


మఠం ముఖద్వారం వద్ద టెండర్‌దారుల నిరసన

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : తిరుపతి గాంధీ రోడ్డులో శిథిలావస్థకు చేరిన హథీరాం బావాజీకి చెందిన మఠం భవనం కూల్చివేతకు సంబంధించిన టెండర్ల స్వీకరణ ప్రక్రియ శనివారం నిర్వహించారు. ఎండోమెంట్ కమిషనర్, నగరపాలక సంస్థ కమిషనర్ నోటీసులతో మఠం పరిపాలనాధికారి బాపిరెడ్డి కూలివేత ప్రక్రియకు సంబంధించి టెండర్ల ఆహ్వానిస్తూ ప్రకటన జారీ చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, పుత్తూరు, తిరుపతి వివిధ ప్రాంతాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు చేసిన ఐదుగురితో పాటుగా 27 మంది ఆఫ్‌లైన్‌లో మొత్తం కలిపి 32 మంది ఈ టెండర్ నిర్వహణలో పాల్గొన్నారు. మఠం భవనం కూల్చివేసే సమయంలో అక్కడి మెటీరియల్‌కు సంబంధించి నిర్వహించిన టెండర్ ప్రక్రియలో మొదటగా ఆన్‌లైన్‌లో రూ.37 లక్షల రూపాయలకు బిడ్ దాఖలు కావడంతో, మఠం అధికారులు అక్కడి నుంచే వేలం పాటను ప్రారంభించగా పుత్తూరుకు సంబంధించిన పయనీర్ స్టీల్స్ వారు రూ.97 లక్షల20 వేల రూపాయలకు హెచ్చు పాటను నమోదు చేశారు. అలాగే భవనం కూల్చివేతకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలో రూ.లక్షా 50 వేల రూపాయలను హెచ్చు పాటగా నమోదు చేయడంతో వీరికి రెండు టెండర్లను ఇస్తున్నట్లుగా మఠం అధికారులు ప్రకటించారు.

రీ టెండర్ నిర్వహించాలి
శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేతకు సంబంధించి శనివారం జరిగిన టెండర్ ప్రక్రియ వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా జరిగిందని రాజమండ్రికి చెందిన గుత్తేదారు నూర్ షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐఐటీ నివేదిక ప్రకారం మఠం మండువా భవనం ప్రాంతంలో ఎక్కడ నుంచి ఎక్కడి వరకు కూల్చివేతలు నిర్వహిస్తారనే అంశంపై ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా టెండర్లు నిర్వహించడం సమంజసం కాదన్నారు. జిల్లా కలెక్టర్ ఈ టెండర్ ప్రక్రియలో జోక్యం చేసుకొని రీ టెండరింగ్ నిర్వహిస్తే మరింతగా వేలంపాట నగదు పెరిగే అవకాశం ఉందనే వాదన వినిపించారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని కలెక్టర్ మఠం భవనం కూల్చివేతకు సంబంధించి రీ టెండరింగ్‌కు చర్యలు తీసుకోవాలని టెండర్‌దారులు కోరారు.

నిరసనలు.. నినాదాలు

దుకాణదారులు మఠం ప్రారంభ ద్వారం వద్ద మఠం అధికారుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కాగా దుకాదారులకు మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకుడు మఠం అధికారిని ఉద్దేశించి తమ మాటను కాదని భవనం కూల్చివేతకు అడుగేస్తే ఎదురయ్యే శాంతి భద్రతలకు సమస్య కారణం అవుతారంటూ పరోక్షంగా చేసిన హెచ్చరికలు భయోందోళనలకు దారితీశాయి.

టీడీపీ నేత జోక్యం


మఠం అధికారితో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు

టెండర్ నిర్వహిస్తున్న సమయంలో మఠం ముందున్న దుకాణదారులు టీడీపీ నేతను రంగంలోకి దించారు. మరికొందరు రాజకీయ నాయకులతో కలిసి పరిపాలన అధికారి బాపిరెడ్డితో వాదించడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దుకాణదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి టెండరు ప్రక్రియ నిర్వహించాలంటూ చేసిన హెచ్చరికలు టెండర్ ప్రక్రియకు హాజరైన వారిని ఆలోచనలో పడేశాయి. దీంతో తాము కట్టిన డబ్బులను మాకు తిరిగి ఇవ్వాలని అడిగారు. ఒకవేళ టెండర్ దక్కించుకున్న తర్వాత పనులు జరగనివ్వకుండా అడ్డుపడితే తాము కట్టిన డబ్బుకు, అప్పుడు ఎదురయ్యే పరిస్థితికి ఎవరు సమాధానం చెబుతారని భయాందోళన టెండర్ దారుల్లో వ్యక్తమైంది. పరిపాలన అధికారి బాపిరెడ్డి కలగజేసుకొని వారికి నచ్చజెప్పి టెండర్ ప్రక్రియను సజావుగా సాగేలా కృషి చేశారు.

ఆడికృత్తిక ఉత్సవాలకు సారె

- ఆనందగిరి, పద్మగిరి క్షేత్రాలకు పట్టువస్త్రాలు
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి సమర్పణ


ఊట్లవారిపల్లి సుబ్రమణ్యేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి


పద్మగిరిపైకి పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ఆడికృత్తిక మహోత్సవాలను పురస్కరించుకుని పాకాల, తిరుపతి రూరల్ మండలాల్లో సుబ్రమణ్యస్వామి ఆలయాలకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు సారెను సమర్పించారు. ఏటా ఆడికృత్తిక ఉత్సవాలకు సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలతో సారెను తీసుకువెళ్లి సమర్పించారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సారెను తీసుకువెళ్లగా వారి వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు వెళ్లారు. ముందుగా పాకాల మండలం ఊట్లవారిపల్లి వద్దనున్న ఆనందగిరి శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వారికి పట్టువస్త్రాలను అందించారు.

పద్మగిరి కొండపై పూర్ణకుంభ స్వాగతం
పద్మగిరిపై వెలసిన బాలజ్ఞాన దండాయుధపాణి ఆలయానికి పట్టు వస్త్రాలను తుడా మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజక వర్గం ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందజేశారు. ఆలయం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శనానంతరం వేద పండితుల ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తిరుపతి రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్ఐఎంసీలో 8వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

తిరుపతి సిటీ : రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్‌లో 2026 విద్యా సంవత్సరానికి గాను 8వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో 7వ తేదీ డిసెంబర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు 2వతేదీ జూలై 2013 నుంచి 01 జనవరి 2015 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు అని, ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తులు వంటి సమాచారం కోసం 9399976999/ 8688888802/03 ఫోన్ నంబర్లలో గాని వరదరాజనగర్ లోని విశ్వం సైనిక్ అండ్ మిలిటరీ పోటీ పరీక్షల సమాచార కేంద్రంను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ యాదవ్

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన నల్లబోయిన గంగాధర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల చేశారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

తిరుమల : తిరుమల డౌన్ ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. స్కూటర్‌పై వస్తున్న ఇద్దరు మహిళల్లో, ఒకరికి ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి వాహనదారులు స్పందించి వారిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. గాయపడిన మహిళ టీటీడీ ఉద్యోగి సతీమణిగా గుర్తించారు.

బంగారు కమ్మల మేళా

– తిరుపతి ఎగ్జిబిషన్ సేల్ నేటితో ముగింపు



బంగారు కమ్మల మేళాకు హాజరైన పలువురు కొనుగోలుదారులు

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరం రామానుజు సర్కిల్ సమీపంలోని ఏకాంత బ్లిస్‌లో శనివారం బంగారు కమ్మల మేళాను శ్రీకాళహస్తికి చెందిన మాధురీ గోల్డ్ షాపు వారు నిర్వహించారు. ఆదివారంతో ఈ మేళా కార్యక్రమాన్ని ముగించనున్నారు. బంగారు కమ్మల మేళాలో వందకుపైగా మోడల్స్‌ను ప్రదర్శించారు. అందర్నీ ఆకట్టుకునేలా మేళాలో వివిధ మోడల్స్‌ను చూపడంతో పలువురు ఆకర్షితులయ్యారు. ప్రతి గ్రాముపై 501 తగ్గింపు ప్రకటించడంతో ఆదరణ లభించిందని మాధురీ గోల్డ్ ప్రొపరైటర్ సునీల్‌కుమార్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇచ్చింది తీసుకో.. పెట్టిందే తిను!

- ప్రైవేటు పరిశ్రమల్లో కార్మికుల పరిస్థితి దయనీయం
- ప్రశ్నిస్తే వేధింపులు.. ఏజెన్సీల మాటే శాసనం
- ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కొత్తగా క్లియరెన్స్ పత్రాలు ఇవ్వాలని మెలిక
- అరకొర జీతాలు.. అర్ధాకలితో అవస్థలు
- బోరుమంటున్న కార్మికులు



పుత్తూరులో కార్మికుల నుంచి కొత్తగా అప్లికేషన్లు తీసుకుంటున్న సిబ్బంది, శ్రీకాళహస్తిలో కార్మికుల నుంచి తీసుకున్న అప్లికేషన్లు

రేణిగుంట : విమానాశ్రయం సమీపంలోని ప్రైవేట్ కార్పొరేట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న వేల మంది కార్మికులు కార్పొరేట్ సంస్థ చేతుల్లో కీలుబొమ్మలుగా మారి విలవిలలాడుతున్నారు. చదువుకొని ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులు పరిశ్రమలు పెట్టే నిబంధనలను గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒప్పుకుంటూ అగ్రిమెంట్లపై సంతకాలు చేసి ఉద్యోగాల్లో చేరుతున్నారు. దాన్ని ఆసరాగా చేసుకుంటున్న పరిశ్రమలు ఏజెన్సీలతో కుమ్మక్కై తాము ఇచ్చిందే జీతం, పెట్టిందే భోజనం అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ బాధలు పడలేక రెండు రోజుల క్రితం రెండు పరిశ్రమలోని సుమారు 1500 మంది పైగా రెండు విడుతలుగా పరిశ్రమ ముందు కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. వారికి రెండు రోజుల్లో సమస్యలను పరిష్కారం చూపుతామని నచ్చజెప్పారు. కానీ అక్కడే పరిశ్రమ వారి ఈగో హర్ట్ అయింది.. కార్మికులకు కొత్త నిబంధనలు పెట్టి వేధింపులు మొదలుపెట్టారు.

పోలీస్ క్లియరెన్స్ కావాలంటూ మెలిక

ఎన్నో ఏళ్లుగా పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ప్రస్తుతం నూతనంగా చేరుతున్నట్లు అప్లికేషన్ రాసి పోలీస్ క్లియరెన్స్ , హెల్త్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు జత చేసి ఇవ్వాలంటూ పరిశ్రమల యాజమాన్యం మెలిక పెట్టింది. ఇప్పటికే పనిచేస్తున్నా మళ్లీ ఇవన్నీ ఎందుకని ప్రశ్నించిన కార్మికులను ఇలా ఇస్తే ఇవ్వండి లేదా మీ ఇష్టం అంటూ పరిశ్రమ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

ఏజెన్సీల శ్రమ దోపిడీ

బాగా చదువుకొని ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్న యువతీ, యువకులు ఏజెన్సీల మత్తులో పడుతున్నారు. ఏజెన్సీల ద్వారా ప్రైవేట్ పరిశ్రమల్లో చేరుతున్న కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. 30 రోజులపాటు శ్రమించి జీతం నాటికి ఎంత వస్తుందో, ఎప్పుడు వస్తుందో తెలియక కార్మికులు మదన పడుతున్నారు. పరిశ్రమ వారిని అడిగితే ఏజెన్సీని అడగమని ఏజెన్సీ వారిని అడిగితే పరిశ్రమ వారిని అడగమని చెబుతూ కాలయాపన చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. లేబర్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి ఏజెన్సీల ద్వారా ఇబ్బందులు పడుతున్న కార్మికులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. కార్మికుల సమస్యలపై సీఐటీయూ నాయకులు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కాంట్రాక్టర్ల నుంచి కార్మికులకు రక్షణ కల్పించండి అంటూ కరపత్రాలను ప్రచురించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

నాల్గో సారీ!





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి పక్కన సీఈఓ రవికుమార్‌నాయుడు

- తూతూమంత్రంగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- రెండున్నర గంటల్లోనే ముగించేశారు
- కనిపించని పలువురు ఎమ్మెల్యేలు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. శనివారం జెడ్పీ 4వ సర్వసభ్య సమావేశం చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన, సీఈఓ రవికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. జేసీ విద్యాధరి హాజరయ్యారు. ఇక సత్యవేడు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆదిమూలం, మురళీమోహన్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మినహా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరు కాలేదు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభించగా మధ్యాహ్నం 1.30కు ముగించేశారు. అజెండాలో 11 అంశాలపై చర్చ జరపాల్సి ఉండగా.. తూతూమంత్రంగా కానిచ్చేశారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి పలు శాఖల అధికారులు హాజరు కాలేదు. సభ్యుడు కానీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ సమావేశానికి హాజరవ్వడం గమనార్హం.

50 ఏళ్లుగా ఇలాంటి పాలన చూడలేదు

ప్రజాప్రతినిధులంటే దిష్టిబొమ్మల్లా అధికారులకు కనపడుతున్నట్టు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఇలాంటి పిచ్చి తుగ్లక్ పాలన చూడలేదని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో తన చేతులమీదుగా ఇచ్చిన చెక్‌ను మరోసారి కార్యక్రమం పెట్టి ఇంకొకరి చేతుల మీదుగా వ్యవసాయశాఖాధికారులు ఇప్పించారన్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారుల పై స్పీకర్, ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. గత పాలనలో రోడ్ల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో బాగా జరిగాయన్నారు. ప్రస్తుతం 36 రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వాపోయారు. ఆర్‌అండ్‌బీ బైపాస్ రోడ్డు మంజూరైనా పనులు చేయలేదని, సీకేపాడి, నాగలాపురం- శ్రీసిటీ, నాగలాపురం-టీపీకోట రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. చాలా రోడ్లపై కనీసం ఆర్టీసీ బస్సులు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కేవీపురం మండలం, ఎగవ పూడిబ్రిడ్జి, నారాయణవనంలోని తంబూరు, పాలమంగళం బ్రిడ్జిలు దెబ్బతిన్నాయన్నారు. నాగలాపురం-సురటపల్లెకు వెళ్లే మార్గంలో మూడు కిలోమీటర్లు రోడ్డు వేయాల్సి ఉందన్నారు. జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో కనీసం ఫర్నిచర్ కూడా లేదన్నారు.

108 వాహనాలు లేవు

పలు ప్రభుత్వాస్పత్రుల్లో 102, 104, 108 వాహనాలు అందుబాటులో లేవని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆరోపించారు. అత్యవసర కేసులను సమీపంలో ఉండే నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపాలన్నారు.

సమస్యలు ఏకరువు

- తమకు గౌరవం ఎలాగో ఇవ్వడం లేదు.. కనీస వేతనం అయినా ఇవ్వాలని జెడ్పీటీసీలు, ఎంపీపీలు డిమాండ్ చేశారు.
- అధికార కార్యక్రమాలకు పిలవని సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జెడ్పీటీసీ సుమన్ కోరారు. – శ్రీకాళహస్తి-కేకే రోడ్డు బాగాలేదని, పీలేరు-భాకరపేట దారి సరిలేదని జెడ్పీటీసీలు సుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి ఆరోపించారు.
- చిత్తూరు చర్చి వీధిలోని దేవదాయశాఖ ఏసీ కార్యాలయాన్ని ఎందుకు సంతపేటకు మార్చారని కుప్పం జెడ్పీటీసీ శరవణ నిలదీశారు. • మండలంలోని పాఠశాలలకు ప్రహరీగోడలు నిర్మించాలని గుడుపల్లె జెడ్పీటీసీ కృష్ణమూర్తి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

పోరాటయోధుడు గౌతు లచ్చన్న



గౌతు లచ్చన్న జయంతి వేడుకల్లో కలెక్టర్‌తో పాటు బీసీ సంక్షేమశాఖ అధికారులు, సంఘం నేతలు



గౌతు లచ్చన్నకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్ : పోరాట యోధుడు గౌతు లచ్చన్నగా కలెక్టర్ వెంకటేశ్వర్ కీర్తించారు. శనివారం కలెక్టరేట్‌లో విప్లవ నాయకుడు ' డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రైతు బాంధవుడు ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పనిచేశారని కొనియాడారు. స్ఫూర్తిదాయక జీవితం, అందరికి ఆదర్శమని, వారి త్యాగాలను మరవకుండా తప్పక స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చంగయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోత్స్న, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రమేష్ బాబు, తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ నాగరాజు, సంఘం నాయకులు కిరణ్, వెంకట మణిబాబు, మను శేఖర్,మల్లికార్జున, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో వేడుకలు

తిరుపతి క్రైం : నిస్వార్థ రాజకీయ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘనంగా నిర్వహించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గౌతు లచ్చన్న తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. నిజాయతీ పరుడైన రాజకీయ నాయకుడని అందుకే పలుమార్లు లోకసభకు ఎన్నికయ్యారన్నారు.

మద్యం అక్రమ కేసులో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన హిమకిషోర్

శ్రీకాళహస్తి : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తులకనం హిమకిషోర్ (30)ను శనివారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లావణ్య తెలిపారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధికి చెందిన హిమకిషోర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలోని అయ్యలనాడు చెరువు కట్టపై అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ లావణ్య చెప్పారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

తిరుపతి క్రైమ్ : తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరిముల్లా ఆదేశాల మేరకు శనివారం తిరుపతి నగరంలోని అక్కారంపల్లి సర్కిల్ సమీపంలోని వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. వారితో పాటు సివిల్ సప్లయి డీటీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు. అయితే ఫిల్లింగ్ స్టేషన్‌లోని 7 పంపుల్లో రెండు నాజల్స్‌లో కొలతల అంశంలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ మేరకు రెండు నాజల్స్‌ను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

డిస్టెన్స్‌లో ఆ కోర్సులకు మంగళం!

తిరుపతి సిటీ : ఉన్నత విద్యా సంస్థలు, యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న దూరవిద్య, సార్వత్రిక విద్యా కేంద్రాలలో పలు కోర్సులకు ప్రవేశాలు చేపట్టరాదని యూజీసీ ఆదేశించినట్లు తెలుస్తోంది. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సిఫార్సుల మేరకు త్వరలో ఆయా వర్సిటీలకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఆదేశాలు జారీ చేయనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే సంబంధిత కోర్సులపై నిషేధం విధించనుంది. ఇందులో ప్రధానంగా సైకాలజీ, మైక్రో బయాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ సైన్స్, బయో టెక్నాలజీ, క్లినికల్ న్యూట్రీషియన్ వంటి ఆరోగ్య సంరక్షణ కోర్సులను దూర విద్య ద్వారా అందించరాదని నిషేధం విధించనుంది.

గోకులాష్టమి ఆస్థానం



వెంకన్న ఆలయ ఆస్థానంలో బాల గోపాలుడు

నారాయణవనం: స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోకులాష్టమి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్యపూజా కార్యక్రమాలు పూర్తి చేసి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఆస్థాన మండపంలో బాలగోలుడిని పీఠంపై కొలువుదీర్చారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ బాలగోపాలుడికి ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపాన్ని నేతి దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు మాట్లాడుతూ ఆదివారం ఆలయంలో గోకులాష్టమి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం శ్రీకృష్ణుడి మాడవీధి ఊరేగింపు, సాయంత్రం సన్నిధి వీధిలో ఉట్లోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నో ఎట్ హోం!

- టీటీడీ ఈఓ వర్సెస్ చైర్మన్
- అంతర్గత విభేదాలకు తెరతీసిన వైనం
- కార్యక్రమం నిర్వహించకపోవడంపై ఉద్యోగుల్లో చర్చ

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ శ్యామలారావు మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలకు తెరతీసిందంటే.. ఔననే సమాధానం ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఇద్దరి మధ్య విభేదాల కారణంగానే శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల అనంతరం సాయంత్రం ఈఓ ఎట్ హోం నిర్వహించలేదని టీటీడీ ఉద్యోగుల్లో చర్చకు దారి తీసింది. ఆగస్టు 15, అలాగే జనవరి 26న జాతీయ పర్వదినాల్ని పురస్కరించుకుని ఎట్ హోం కార్యక్రమాలను సంప్రదాయంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ ఈఓ శ్యామలారావు ఎట్ హోం నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పలు సందేహాలు

స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్ ఎట్ హోం నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే మరో సీనియర్ ఐఏఎస్ అధికారిగా ఉన్న టీటీడీ ఈఓ ఎట్ హోం కార్యక్రమ నిర్వహణకు దూరంగా ఉండాల్సి వచ్చిందనే అంశం పలు సందేహాలను రేకెత్తిస్తోంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరుపతిలో ఉండడం, ఆయనను ఆహ్వానించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ఎట్ హోం నిర్వహించలేదనే భావన టీటీడీ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. గత ఏడాది ఇదే ఈఓ ఎట్ హోం నిర్వహించారంటూ గుర్తు చేస్తున్నారు. అయితే ఎట్ హోం నిర్వహించకపోవడానికి వర్షం అడ్డంకిగా ఉందంటూ ఇచ్చిన వివరణ ఉద్యోగులకు నమ్మ శక్యంగా లేదనే వాదనలు లేకపోలేదు. ఇదే తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టరేట్‌లో ఎట్‌హోం నిర్వహించడం విశేషం. అయితే కలెక్టర్ నిర్వహించడానికి లేని వర్షం ఆటంకం , ఈఓ విషయానికి వచ్చే సరికి ఎలా అడ్డంకి అయ్యిందనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

మీడియాపై వివక్ష

జిల్లా కలెక్టర్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమం పూర్తిగా వివక్షకు దారితీసింది. ప్రభుత్వ అనుకూల మీడియా ప్రతినిధులను మాత్రమే ఆహ్వానించి మిగిలిన వారిని పట్టించుకోకపోవడం వివక్ష చూపుతున్నారనే విషయం బహిర్గతమైంది.

అంతర్గత విభేదాలే కారణమా?

అనేక సందర్భాల్లో ఉద్యోగుల ముందే బహిరంగంగా వారిద్దరూ పరస్పర వాదనలు చేసుకున్న అంశాలు అంతర్గత విభేదాలకు బీజం పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గోశాలలో ఆవుల మరణాల్లో ఇద్దరూ భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించారు. అదే విధంగా టీటీడీ బోర్డు సమావేశాల్లోనూ భిన్నమైన వాదనలు చేసుకున్నట్టు సంబంధిత సభ్యులే అనధికారికంగా చెబుతున్నారు. శ్రీవాణి ట్రస్ట్ రద్దు, ఏఐతో తక్కువ సమయంలో దర్శనాలు తదితర అంశాల్లో అధికారులతో సంప్రదించకుండా చైర్మన్ ప్రకటనలు ఇస్తున్నారనే అసంతృప్తి ఈఓ వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ విషయాలపై టీడీపీ అనుకూల మీడియాలోనే కథనాలు కూడా వచ్చాయి. సాక్షాత్తు సీఎం చంద్రబాబు సమక్షంలోనే బీఆర్ నాయుడు, శ్యామలారావు పరస్పరం నువ్వెంత అంటే? నువ్వెంత అని వాదులాడుకోవడం పరాకాష్టగా నిలిచింది. ఇలాంటి వరుస ఘటనల నేపథ్యంలో ఈవో ఎట్ హోం నిర్వహించలేదనే అభిప్రాయానికి బలం చేకూర్చుతోంది. అయితే రానున్న రోజుల్లో టీటీడీ బ్రహ్మోత్సవాలపై ఇరువురి మధ్య విభేదాలు తార స్థాయికి వెళ్లవచ్చనే అంశం టీటీడీ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.